## క్లుప్తంగా

### ప్రజా నాయకుడు ఊమెన్ చాందీ

రాయచోటి టౌన్ : నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేసి ప్రజల గుండెల్లో నిలిచిన ప్రజా నాయకుడు ఊమెన్ చాందీని అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్ మన్సూర్ అలీఖాన్ అన్నారు. మంగళవారం రాయచోటి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఊమెన్ చాందీ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. కేరళకు రెండు సార్లు ముఖ్యమంత్రిగా ప్రజలకు సుపరిపాలన అందించారని చెప్పారు. నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు చేశారని గుర్తు చేశారు. ఆయన సేవలను కాంగ్రెస్ ఎన్నడూ మరిచిపోదన్నారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

### నేడు వాహనాల వేలంపాట

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం పోలీసు స్టేషన్‌లో పట్టుబడిన వాహనాలకు సంబంధించి బుధవారం బహిరంగ వేలంపాటను నిర్వహిస్తున్నామని మంగళవారం ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నాలుగు చక్రాల వాహనం, 9 ద్విచక్ర వాహనాలకు వేలం వేయనున్నారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ పర్యవేక్షణలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, తహసీల్దారు లక్ష్మీదేవిల ఆధ్వర్యంలో వేలం నిర్వహించనున్నారు.

### అర్జీలను పరిష్కరించాలి

పుల్లంపేట : జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించి 11 రకాల సేవలను అర్హులకు అందించాలని తహసీల్దార్ నరసింహ కుమార్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోరాదని సిబ్బందికి సూచించారు. ఆర్‌ఐ నవీన్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

### విద్యుత్ మీటర్లను బయట అమర్చుకోవాలి

రాజంపేట టౌన్ : విద్యుత్ వినియోగదారులు మీటర్లను విధిగా బయట అమర్చుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లోని వినియోగదారులు అనేక మంది తమ ఇళ్లల్లో, షాపుల్లో మీటర్లను అమర్చుకున్నారన్నారు. తమ సిబ్బంది రీడింగ్ తీసేందుకు వచ్చిన సమయంలో వినియోగదారులు ఒకొక్కమారు తమ ఇళ్లల్లో, షాపుల్లో ఉండకపోవడం వల్ల రీడింగ్ తీసేందుకు వీలు ఉండటం లేదన్నారు. ఈ కారణంగా రెండు, మూడు నెలలకోమారు రీడింగ్ తీస్తే బిల్లులలో వ్యత్యాసం వస్తోందన్నారు. రీడింగ్ తీసుకునేందుకు వీలుగా మీటర్లను ఉచితంగా బయట అమర్చుతారని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

### ఎరువుల దుకాణాల తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న రాజకుమారి

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం వ్యవసాయశాఖ అధికారిణి జి.రాజకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తిరుమల ఫర్టిలైజర్స్‌లో ఎంఓపీకి సంబంధించి ఎరువుల నిల్వలో తేడా ఉండటంతో విక్రయాలను నిలుపుదల చేసినట్లు ఆమె తెలిపారు. ఎరువుల షాపు యజమానులు రికార్డులను సరిగా నిర్వహించాలని, కల్తీ ఎరువులు, విత్తనాలు, కల్తీ పురుగుల మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో వీఏఏ దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### చౌడేశ్వరీదేవికి పూజలు

రాయచోటి టౌన్ : ఇకపై ప్రతి రోజు భక్తులకు ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి దర్శనమిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచే అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేయనున్నట్టు వారు తెలిపారు. భక్తుల దర్శనార్థం ప్రతి రోజు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేస్తామని చెప్పారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

### విజయవంతం చేయండి

పెనగలూరు : హైదరాబాద్‌లో జరిగే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని రైల్వేకోడూరు నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకుడు నగిరిపాటి చెంగయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు లక్షల మందితో సభను విజయవంతం జరుపడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మండలంలోని వెలగచర్లలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎస్సీ వర్గీకరణ నిమిత్తం ఈ సభను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పసుపులేటి జయరామయ్య, ఎంఎస్పీ నాయకుడు శ్రీనివాసులు, సుబ్బనరసయ్య, వెంకటేషు, తలారి శ్రీనివాసులు, చక్రంపేట నరసింహులు, మణి, లక్ష్మయ్య, వెంకటయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ మేలు చేయాలన్నదే సీఎం ఆశయం


రాజంపేట టౌన్: సర్టిఫికెట్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


లక్కిరెడ్డిపల్లె: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి

రాజంపేట టౌన్ : అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. మండలంలోని ఆర్.రోళ్ళమడుగులో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆకేపాటి పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రజల ముంగిటికే పాలన తీసుకొచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జగన్ తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలాగే ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. సర్పంచ్ కొండూరు రఘురామరాజు, ఉపసర్పంచ్ వెంకటరామయ్య, జేసీఎస్ రూరల్ ఇన్‌ఛార్జ్ వి.గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు జీవీ సుబ్బరాజు, దాసరి పెంచలయ్య, అమర తదితరులు పాల్గొన్నారు.

**పేదల సంక్షేమమే ధ్యేయంగా..**

చిన్నమండెం : పేద ప్రజల సంక్షేమమే సీఎం జగన్ ఆశయమని సర్పంచ్ ముసల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని వండాడి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 11 రకాల సర్టిఫికెట్లను అర్హులైన 314 మందికి పంపిణీ చేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ అబ్బలోబ్, తహసీల్దార్ శ్రీరాములునాయక్, ఎంపీడీఓ రహీమ్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీ సుమిత్ర, సునంద, ఎంఎల్ఓ దివాకర్‌నాయక్, జేసీఎస్ మండల ఇంచార్జ్ అంజనప్ప, వైఎస్ఆర్‌సీపీ నాయకులు రంగారెడ్డి, రెడ్డివరప్రసాద్, రెడ్డి భూషణ్‌రెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, రమణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

**సిద్దవటంలో..**

సిద్దవటం : 11 రకాల ప్రభుత్వ సర్టిఫికెట్లను లబ్ధిదారులకు ఉచితంగా అందిచాలన్నదే జగనన్న సురక్ష లక్ష్యమని తహసీల్దారు లక్ష్మీదేవి తెలిపారు. సిద్దవటం మండలంలోని మాధవరం – 1 గ్రామ పంచాయతీలోని గ్రామ సచివాలయం–1 లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ కుమారుడు చంద్రశేఖర్, ఎంపీటీసీలు శివయ్య, లక్ష్మిరెడ్డి, వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఎం.సుబ్బారెడ్డి, జి.ఓబులయ్య, ఉపసర్పంచ్ సుబ్బారెడ్డి, సొసైటీ డైరెక్టర్ నారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ వెంకట్, ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్, ఏపీఎం వెంకటేష్, ఆర్‌ఐ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

**మహిళా పక్షపాతి సీఎం జగన్ : సాయికిషోర్ రెడ్డి**

ఓబులవారిపల్లె : మహిళా పక్షపాతి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఏపీటీడీసీ డైరెక్టర్, మండల కన్వీనర్ వి.సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొర్లకుంట, చెన్నరాజు పోడు గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమంలో సాయికిషోర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం 350 మందికి వివిధ రకాల ధృవ పత్రాలను అందజేశారు. మాజీ సింగల్ విండో అధ్యక్షుడు టంగుటూరి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు కొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు ఎస్‌పీ జయపాల్ రెడ్డి, కె.సావిత్రి, సుంకేశుల ఇబ్రహీం, నరేంద్రరాజు, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సుంకేసుల రఫీ, ప్రత్యేక అధికారి నాగభూషణం, ఎంపీడీఓ విజయారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

**చిట్వేలిలో..**

చిట్వేలి : ప్రజలను అన్ని విధాల ఆదుకుంటూ వారి అభివృద్దే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని స్థానిక ఉప సర్పంచ్ చొడవరం ఉమామహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చిట్వేలి 1,2 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష పథకం సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జనన, మరణ, ఆదాయ వంటి పలు ధృవీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. తహసీల్దార్ శిరీషా, ఎంపీడీఓ శివరామిరెడ్డి, లింగం లక్ష్మీకర్, గుండయ్య, హజరత్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు అన్వర్ బాషా, శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష**

లక్కిరెడ్డిపల్లె : ప్రజా సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మద్దిరేవుల ఈడిగపల్లె సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలతో కలిసి మోహన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్షలో భాగంగా 11 రకాల సరీ్వసులను అర్హులకు అందజేసేందుకు వలంటీర్లు ప్రతి ఇంటి తలుపుతట్టి వారికి అందాల్సిన సర్టిఫికెట్లను సచివాలయ పరిధిలో తయారు చేయించి ఖర్చు లేకుండా ఉచితంగా అందజేస్తుండడం అభినందనీయమని తెలిపారు. తదుపరి అర్హులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. తహసీల్దార్ ఉదయ శంకర్ రాజు, ఎంపీడీఓ వెంకటరమణా రెడ్డి, ఈఓపీఆర్డీ పట్నాయక్, పంచాయతీ సెక్రటరీ ఇమామ్ బాషా, సుధీర్, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, రవిరాజు, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, సుబ్బరాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**గ్రామీణాభివృద్ధే లక్ష్యం**

రామాపురం : గ్రామీణ అభివృద్ధి జగనన్న సురక్ష ప్రధాన లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ బయారెడ్డిగారిపల్లె, సరస్వతిపల్లె సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయా గ్రామాల సర్పంచ్‌లు మునీర్‌బాషా, ఉప సర్పంచ్ ఆంజనేయులురెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. బయారెడ్డిగారిపల్లెలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, మండల ప్రత్యేకాధికారి సుస్మిత, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అరవింద్ కిషోర్, ఎంపీడీఓ హైదర్‌వలి, ఈఓపీఆర్డీ ఉషారాణి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, యోగాంజనేయరెడ్డి, నాగబసిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీదేవి, చంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

**జగనన్న సురక్ష ప్రజలకు వరం**

గాలివీడు : జగనన్న సురక్ష ప్రజలకు వరం లాంటిదని వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌మోహిద్దీన్, గుమ్మా అమర్‌నాథరెడ్డి, సర్పంచ్ ఉమాపతిరెడ్డి, అరుణమ్మ, ఎంపీటీసీ చంద్రప్రకాష్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం మండలంలోని పందికుంట, పూలుకుంట గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు నేరుగా అధికారులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు వెళ్లి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు.


ఓబులవారిపల్లె: పత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం


నందలూరులో ధృవీకరణ పత్రాలు అందిస్తున్న ఎంపీపీ

**పెన్నపేరూరులో..**

ఒంటిమిట్ట : మండల పరిధిలోని పెన్నపేరూరు సచివాలయం వద్ద మంగళవారం ఎంపీడీఓ రెడ్డయ్య అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల ప్రత్యేక అధికారి సురేష్ కుమార్ హాజరై మాట్లాడారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మంజూరైన 260 పైగా ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మినారాయణ రెడ్డి, తహసీల్దార్ మాధవీలత, మండల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

**పెనగలూరులో..**

పెనగలూరు : ప్రజా శ్రేయస్సు కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసిందనని తహసీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ వరప్రసాద్, పెనగలూరు సర్పంచ్ దేవూరు చిన్న వెంగల్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం పెనగలూరు – 1, కొండూరు – 1 సచివాలయాలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ ఉదయగిరి సుబ్బరాయుడు, ఎన్ఆర్ పురం సర్పంచ్ సుజాత, ఏఓ పద్మభూషన్ రెడ్డి, మండల ఎంపీపీ వసుంధర, కొండూరు సర్పంచ్ రామాంజులమ్మలతోపాటు అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

**దేశానికే ఆదర్శం జగనన్న పాలన**

నందలూరు(రాజంపేట) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆడపూరు, నల్లతిమ్మాయపల్లెలో జగనన్న సురక్ష కార్యక్రమాలలో ఎంపీపీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏ పథకం అయినా ముఖ్యమంత్రి తీసుకొస్తే అది దేశంలో ఎక్కడా కూడా అమలుచేయని విధంగా ఉంటోందన్నారు. పథకాలను తీసుకొచ్చి వాటి ఫలాలను అర్హులకు అందేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. జెడ్పీటీసీ గడికోట ఉషా, ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరక్టరు బి.లక్ష్మినరసయ్య, సర్పంచ్ చైతన్యభారతి, అన్నం నాగేంద్రబాబు, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, నడివీధి సుధాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# ‘ఆశాల సమస్యలను పరిష్కరిస్తాం’

– ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలకు హామీ ఇచ్చిన డీఎంహెచ్ఓ కొండయ్య


ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ కొండయ్య

రాయచోటి అర్బన్ : విధి నిర్వహణలో ఆశ కార్యకర్తలపై పైస్థాయి అధికారుల వేధింపులను వెంటనే ఆపాలని సీఐటీయూ జిల్లా నేతలు శ్రీనివాసులు, రామాంజులు, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయమ్మ, ఎస్.హెరాన్‌లు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఆశ కార్యకర్తలు మాసాపేట నుంచి జాతీయ రహదారి మీదుగా డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశ కార్యకర్తల జీతం రూ. 25 వేలకు పెంచాలన్నారు. ఆన్‌లైన్ యాప్‌ల నిర్వహణ నుంచి ఆశాలకు మినహాయింపు ఇవ్వాలన్నారు. మెటర్నిటీ లీవులు, ప్రభుత్వ సెలవులు ఆశాలకు అమలు చేయాలన్నారు. జనాభాకు అనుగుణంగా ఆశ వర్కర్ల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, డీఎంఅండ్‌హెచ్ఓ కొండయ్య స్వయంగా వారి వద్దకు వచ్చి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆశాల జాబ్‌చార్టును వెంటనే ఇస్తామని, మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామంటూ హామీ ఇవ్వడంతో ఆశలు వెనుతిరిగారు. కార్యక్రమంలో లావణ్య, రమామణి, మహబూబ్ జాన్, సవిత, మల్లీశ్వరి, రమాదేవి, కవిత, సత్యవాణి, హుజురాభాను, ఫామీదా, సీఐటీయూ నేత ఫయాజ్, రైతు సంఘం నేత రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# 22న కథ చెబుతారా.. ఊ కొడతాం

రాజంపేట టౌన్ : ‘కథ చెబుతారా....ఊకొడతాం’ కథల పోటీలను ఈనెల 22న పట్టణంలోని బాలికోన్నత ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్తు జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదట పోటీలను 20న నిర్వహించాలని నిర్ణయించగా బలిజపల్లె గంగమ్మ జాతర సందర్భంగా తేదీని మారుస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ విషయాన్ని పాఠశాలల యాజమాన్యాలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించాలని కోరారు. 10 సంవత్సరాలలోపు విద్యార్థులు జూనియర్స్ విభాగంగా, 11 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు విద్యార్థులు సీనియర్స్ విభాగంలో పాల్గొనాలని తెలిపారు. ఒకొక్క పాఠశాల నుంచి ఒక్కో విభాగానికి ముగ్గురు చొప్పున ఆరు మంది విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. వివరాలకు 9110779066, 9492562744 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

# ఆశయాలు నెరవేరేలా విద్యను అభ్యసించాలి


మాట్లాడుతున్న ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : తల్లితండ్రుల ఆశయాలను నెరవేర్చేలా విద్యను అభ్యసించాలని ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి అన్నారు. మంగళవారం సీ ప్రోగ్రాంలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఏఐటీఎస్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు సీ లాంగ్వేజిని నేర్చుకోవడం ద్వారా ఇంజనీరింగ్‌లో పాఠాలను అర్థం చేసుకునేకి సులువుగా ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ తమ కళాశాల అధ్యాపకులు మహ్మద్, నవీన్‌లు ఇంటర్ విద్యార్థులకు ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు. 180 మంది విద్యార్థులు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సీఎస్ఈ హెచ్ఓడీ డా.సుబ్బారావు, ఏఐఅండ్‌డీఎస్ హెచ్ఓడీ ఫణీంద్రకుమార్‌రెడ్డి, హెచ్ఓడీ డా.టి.హరికృష్ణ, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలను పరిష్కరించండి



ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

రాయచోటి అర్బన్ : విద్యారంగంలో నెలకొన్న పలు రకాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పట్టణం నుంచి మాసాపేట మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీని నిర్వహించి ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్నారు. వసతి గృహాల విద్యార్థుల సౌకర్యార్థం శాశ్వత భవనాలను నిర్మించాలన్నారు. కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్ఓకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాయచోటి, రైల్వేకోడూరు కార్యదర్శులు లోకేష్, బాలసుబ్రమణ్యం, రాయచోటి నేతలు వెంకట కుమార్, గిరిబాబు, పద్మాకర్, నారాయణ, నరేష్, నాగార్జున, ఓబులేసు, నాగేంద్ర, పవన్ నాయక్, శశికుమార్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగలక్ష్మీ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బైపీసీ గ్రూపులో మిగిలిన సీట్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆమె తెలిపారు. 10వ తరగతి పాసైన వారు ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను కస్తూర్బా గురుకుల పాఠశాలలో అప్పగించాలని ఆమె తెలిపారు.

### నేడు అరవీడులో గడప గడపకు మన ప్రభుత్వం

గాలివీడు : మండలంలోని అరవీడు గ్రామంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి బుధవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19, 20వ తేదీన అరవీడు, 21వ తేదీన గొట్టివీడులో కార్యక్రమం ఉంటుందని మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు.

### నిత్యపూజ స్వామి ఆలయానికి పర్యవేక్షణ కల్పించాలి


జ్యోతిచంద్రశేఖర్

సిద్దవటం : లంకమల అడవుల్లో వెలసిన నిత్యపూజ స్వామి ఆలయానికి పర్యవేక్షణ కల్పించాలని వైఎస్ ఆర్‌సీపీ నాయకుడు జ్యోతి చంద్రశేఖర్ తెలిపారు. సిద్దవటం మండలంలోని మదవరం–1 గ్రామంలో మంగళవారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిద్దవటం మండలంలో ఉన్న ప్రముఖ శైవ క్షేత్రం నిత్యపూజ స్వామి ఆలయానికి సంబంధించిన ఈఓ కార్యాలయాన్ని కడపలో ఉంచడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో ఆలయంపై పర్యవేక్షణ లోపించి హుండీలు చోరీలకు గురయ్యాయని ఆరోపించారు. ఇప్పటికైనా దేవదాయశాఖ అధికారులు నిత్యపూజ స్వామి ఆలయ ఈఓ కార్యాలయాన్ని సిద్దవటంలో ఏర్పాటు చేయాలని కోరారు.

### అబూబకర్ కుటుంబాన్ని ఆదుకుంటాం

రాయచోటి టౌన్ : ఎలక్ట్రీషియన్ అబూబకర్ కుటుంబాన్ని ఆదుకుంటామని రాయచోటి ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, అస్లాం, సురేంద్రారెడ్డి, దామోదర్, షాజహాన్‌లు తెలిపారు. మంగళవారం ఎలక్ట్రీషియన్ అబూబకర్ కుటుంబాన్ని పరామర్శించారు. అబూబకర్ సోమవారం ఎలక్ట్రీషియన్ పనులు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు గాయపడగా ఆయన తన నివాసంలో వైద్యం చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతనిని అసోషియేషన్ సభ్యులు పరామర్శించి తమ వంతుగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### రేపు జాబ్‌మేళా

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాకు డిగ్రీ చేసిన వారు అర్హులు. 25 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లుతో హాజరు కావాలని కోరారు.

# సేవకు సలాం



## కరోనాలో వలంటీరే మా ధైర్యం


ఆడపూరు అరుంధతివాడలో మాస్క్‌లను పంపిణీ చేస్తున్న వలంటీర్ సోని

నందలూరు మండలం ఆడపూరు పంచాయతీలోని అరుంధతివాడ. అక్కడి నివసించే వారంతా కూలినాలీ చేసుకునేవారు. వారికి కరోనా అంటే తెలియదు. అయినప్పటికి అవగాహన లేకుండా కొద్దిరోజులు కూలీ పనులు చేసుకున్నారు. వారికి వీరికి కరోనా సోకిందనే ప్రచారంతో ఇళ్లల్లో నుంచి బయటికి రాలేదు. కూలీ నాలీ చేసుకునే జీవిస్తే ఏ పూటకు ఆ పూటకు ఆకలి తీరుతుంది. కరోనా ప్రభావంతో అల్లాడిపోయారు. సమాచారం తెలుసుకున్న వలంటీరు సోనీ అరుంధతివాడలోకి నేరుగా వెళ్లి వారికి కరోనా సోకకుండా మాస్క్‌లు, శానిటైజర్లు ఇచ్చి అవగాహన కల్పించారు. కొన్ని రోజులు అవసరమైన వారికి దాతలు సహకరం నిత్యావసర సరుకులను అందించి, వారికి ధైర్యం చెప్పారు. మేమున్నామంటూ భరోసా కల్పించింది. తనకు కరోనా సోకుతుందని భయపడకుండా ప్రతి గడపకు వెళ్లింది. కరోనా హయాంలో నుంచి క్షేమంగా బయటపడ్డామంటే అందుకు వలంటీరే కారణమని అక్కడివారు వెల్లడించారు. – నందలూరు(రాజంపేట)

### మా వాడకు దేవుడిలా వచ్చింది వలంటీరు



మాది నందలూరు మండలంలోని ఆడపూరు పంచాయతీ పరిధిలో మాదిగపల్లె. తొలిసారిగా కరోనా మహమ్మారి ప్రాణాలను బలిగొంటున్న సమయంలో ఆ జబ్బు గురించి మాకు తెలియదు. మాకు చెప్పే వారు కూడా లేరు. టీవీలలో చెబుతుంటే భయపడిపోయాం. కరోనా నిబంధనలు తెలియవు. కూలీ చేసుకుంటే పూట గడిచే పరిస్థితి మా కుటుంబాలవి. పనికి పోవాలంటే కరోనా వస్తుందని భయపడ్డాం. ఆ సమపయంలో కొండూరు సోని అనే వలంటీర్ (ఆడపూరు సీ–5 క్లస్టర్) నేరుగా అరుంధతివాడలోకి వచ్చి ధైర్యం చెప్పింది. అందరికి మాస్కులు పంపిణీ చేయడం, శానిటైజర్, మందులు ఇచ్చింది. కరోనాలో సాయం చేసిన వ్యక్తి మా వలంటీర్ ఒక్కరే. అలాంటి వలంటీరు సేవలను ఎన్నడూ మరులేం.

– గద్దం ఇందిరమ్మ, మాదిగపల్లె, ఆడపూరు పంచాయతీ నందలూరు

## ఎంతో విశ్వాసం కలిగించాడు


కరోనా సమయంలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఖాదర్ వలి

ఇతని పేరు ఖాదర్ వలి లక్కిరెడ్డిపల్లె మండలంలో వలంటీర్‌గా సేవలందిస్తున్నాడు. గ్రామంలో తనకు కేటాయించిన కుటుంబాలకు ఖాదర్ వలి అటు కరోనా సమయంలో ఎవరూ ముందుకు రాకపోవడంతో తానే దగ్గర ఉండి సమీపంలోని కోనంపేట పీహెచ్‌సీ కేంద్రానికి తీసుకెళ్లి వైద్యం చేయించి కుటుంబ వ్యక్తిగా ఆదరించాడు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేత మొదలు కొని ప్రస్తుత జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అందిస్తున్న సర్టిఫికెట్లు ఫోను చేసిన వెంటనే వారి ఇళ్లకు వెళ్లి తాను సేవలు అందించడంతో వలంటీర్‌పై ఎంతో విశ్వాసం కలిగించారు. నాడు పింఛన్ కోసం ఇబ్బంది పడ్డాం. నేడు ఇంటి వద్దకే అన్ని అందుతున్నాయి. దీంతో వలంటీర్ ఖాదర్ వలి అందిస్తున్న సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు. – లక్కిరెడ్డిపల్లె

### ఆపద సమయంలో మనుమడిలా..



కరోనా సమయంలో అనారోగ్య పరిస్థితులలో వలంటీర్ ఖాదర్ వలి నాకు దగ్గర ఉండి వైద్యం చేయించారు. వలంటీర్ ఖాదర్ వలి తెల్లవారకమునుపే తలుపు తట్టి పింఛన్‌ను అందిస్తాడు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి లబ్ధిదారుకు అందజేస్తున్నాడు. మాకు ఎటువంటి ప్రభుత్వ లబ్ధి కావాలన్న వలంటీర్‌నే సంప్రదిస్తాం. వలంటీర్లు చేసిన సేవలు ఎన్నటికీ మరువలేం. వలంటరీ వ్యవస్థ ప్రవేశపెట్టిన సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

– ఒడేటి ఛాన్ బీ, కోనంపేట,లక్కిరెడ్డిపల్లె